సాక్షి నిజామాబాద్

బుధవారం । 4 । జూన్ । 2025



ఘరానా దొంగల ముఠా అరెస్ట్

జిల్లాలో చోరీలకు పాల్పడిన ఘరానా దొంగల ముఠా సభ్యులను సీసీ ఫుటేజీల ఆధారంగా పట్టుకున్నట్లు సీపీ తెలిపారు.

- 8లో ▸



ప్రాణాలకు ఖరీదు..

ప్రైవేటు ఆస్పత్రుల్లో కనీస అర్హత లేని వైద్యులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నిర్లక్ష్యంతో ప్రాణాలు తీస్తున్నారు.

- 8లో ▸



వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణం పొడిగా మారుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విత్తనాలు అందిస్తాం

- వ్యవసాయ అధికారి వీరస్వామి



నిజామాబాద్ రూరల్: నాణ్యమైన విత్తనాలను రైతులకు అందజేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి పేర్కొన్నారు. మంగళవారం నిజామాబాద్ రూరల్ మండలం గుండారంలోని రైతు వేదికలో క్లస్టర్ పరిధిలోని రైతులకు 10 కిలోల వరి విత్తనాలు అందజేశారు. ఆర్‌డీఆర్ 1200 వరి రకం వంగడం శ్రేష్ఠమైనదని తెలిపారు. అపరాల పంటలైన ఎంజీజీ పెసర విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో కీటకశాస్త్ర వేత్త సాయిచరణ్, మండల వ్యవసాయాధికారిణి హీరా జాదవ్, వ్యవసాయ విస్తరణ అధి కారులు స్వాతిలత, రాకేశ్, జ్ఞానేశ్వర్, వసంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వయస్సుకు సంబంధం లేకుండా యోగా చేయాలి



నిజామాబాద్‌నాగారం: వయసుకు సంబంధం లేకుండా అందరూ యోగ చేయవచ్చునని, గర్భిణులు సుఖ ప్రసవానికి, బీపీ, షుగర్, ఉబకాయము, గుండె జబ్బుల నివారణకు యోగా సాధన చేయడం చక్కటి మార్గమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రాజ్యశ్రీ పేర్కొన్నారు. 11 వ అంతర్జాతీయ యోగ దినోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పాలిటెక్నిక్ గ్రౌండ్ నుంచి ఓల్డ్ కలెక్టరేట్ గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. నోడల్ అధికారి డాక్టర్ గంగదాస్, జిల్లా యోగ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్, యోగా మాస్టర్లు రామచందర్, సిద్ధిరాములు, సంగీత, శ్రీనివాస్, ఐశ్వర్య, తేజస్విని, రుక్మయ్య కిషన్, భూమయ్య రెడ్ క్రాస్‌ప్రతినిధి రాజశేఖర్ పాల్గొన్నారు.

పాత డీఎస్ఆర్ అటెండెన్స్ విధానాన్ని కొనసాగించాలి



సుభాష్‌నగర్: పంచాయతీ కార్యదర్శులకు పాత డీఎస్ఆర్ అటెండెన్స్ విధానాన్ని కొనసాగించాలని పంచాయతీ కార్యదర్శుల జేఏసీ జిల్లా ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం ఇన్‌చార్జి డీపీవో ముత్యాల శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రతినిధులు మాట్లాడుతూ హాజరు నమోదు కోసం ఉపయోగిస్తున్న డీఎస్ఆర్ యాప్‌లో బయోమెట్రిక్, ఫేషియల్ రికగ్నిజేషన్ మాడ్యుల్‌ను ప్రభుత్వం చేర్చిందని తెలిపారు. తద్వారా వ్యక్తిగత గోప్యత, సమాచార భద్రతపై పంచాయతీ కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. అలాగే పంచాయతీ కార్యదర్శుల హాజరు సమయాన్ని ఉదయం 10.30 గంటలకు చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కవిత అభిమానుల

సోషల్ వార్..

కేసీఆర్‌కు కుమార్తె కవిత రాసిన లేఖ నేపథ్యంలో ఆమెకు మద్దతుగా అభిమానులు, ఉద్యమకారులు సోషల్ మీడియా వేదికగా వార్ కొనసాగిస్తున్నారు. కవితపై 2018 నుంచే కుట్రలు మొదలయ్యాయని, లోక్‌సభ ఎన్నికల్లో ఆమె ఓటమికి అప్పటి ఎమ్మెల్యేలే కారకులయ్యారని సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. ఉద్యమకారులందరం కవిత వెంటే ఉంటామంటూ స్పష్టం చేస్తున్నారు.



- లేఖలోనివి ఆరోపణలు కాదు.. నిజాలంటూ అభిమానుల ప్రచారం
- 2019 నుంచే కవితపై జిల్లాలో కుట్రలు.. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయేలా చేశారంటున్న ఉద్యమకారులు
- పీఆర్‌వో రాజేష్ లేఖ లీక్ చేశాడంటూ వైరల్ అవుతున్న వీడియో
- కవిత ఫొటో డీపీగా పెట్టుకోవద్దంటూ ఓ మాజీ ఎమ్మెల్యే సోదరుడి బెదిరింపులు
- ఫుల్‌స్టాప్ లేకుండా సోషల్‌మీడియాలో భావప్రకటన చేస్తున్న ఉద్యమకారులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె కవిత రాసిన లేఖ విషయమై ఉమ్మడి జిల్లాలో గులాబీ శ్రేణులు గుంభనంగా ఉన్నప్పటికీ ఉద్యమకారులు మాత్రం సోషల్ మీడియా వేదికగా స్వరం గట్టిగా వినిపిస్తున్నారు. లేఖలో కవిత రాసిన అంశాలు ఆరోపణలు కాదని, పచ్చి నిజాలంటూ సోషల్ మీడియాలో వరుస ప్రకటనలు చేస్తున్నారు. మా ధైర్యం మీరే కవితక్క, డాటర్ ఆఫ్ ఫైటర్ అంటూ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఉద్యమకారులైన కొందరు సీనియర్ కార్యకర్తలైతే మరింత ఘాటుగా సోషల్ వార్‌లోకి దిగారు. జిల్లాలో కవితపై 2018 నుంచే కుట్రలు మొదలయ్యాయని, 2019 లోక్‌సభ ఎన్నికల్లో కవిత ఓటమికి ఎమ్మెల్యేలే కారకులయ్యారని అందుకు తామే ప్రత్యక్ష సాక్షులమంటూ బహిరంగ ప్రకటనలు సోషల్ మీడియా వేదికగా చేస్తున్నారు. ఉద్యమకారులందరం కవిత వెంటే ఉంటామంటూ చెబుతున్నారు. కవిత ఉనికిని ఓర్వలేని ఉమ్మడి జిల్లాలోని కొందరు మాజీ ప్రజాప్రతినిధులు పలువురు ఉద్యమకారులను పార్టీ నుంచి బయటకు వెళ్లేలా చేసినట్లు, కవితకు కమ్యూనికేట్ కాకుండా చేసినట్లు విమర్శలు గుప్పిస్తున్నారు. నగరానికి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే సోదరుడు షాడో ఎమ్మెల్యేగా వ్యవహరించడమే కాకుండా కవిత ఫొటోలను డీపీలుగా పెట్టుకోవద్దు, మా సోదరుడి ఫొటోను మాత్రమే పెట్టుకోవాలంటూ బెదిరింపులు చేసినట్లు చెబుతున్నారు. ఈ మాజీ ఎమ్మెల్యే సోదరుడు షాడో మాదిరిగా వ్యవహరించడమే కాకుండా దళితబంధు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇతర పథకాల్లో చాలామంది వద్ద భారీగా డబ్బులు వసూలు చేసినట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



లేఖ లీక్ పై సోషల్ మీడియాలో వైరల్..

కవితకు పీఆర్‌వోగా ఉన్న రాజేష్ అనే వ్యక్తి కేసీఆర్‌కు రాసిన లేఖను లీక్ చేసినట్లు తాజాగా సోషల్ మీడియాలో వీడియో వైరల్ అవుతోంది. ఈ విషయమై కేటీఆర్, హరీశ్‌రావు టీముల కు సాక్ష్యాధారాలతో పూర్తి వివరాలు తెలిసినట్లు వీడియోలో ఉంది. ఈ పీఆర్‌వోనే కవితకు సంబంధించిన ప్రతి సమాచారాన్ని బయటకు విడుదల చేసినట్లు ఇందులో ఉంది. కేటీఆర్, హరీశ్‌రావులపై సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేయించినట్లు పేర్కొన్నారు.

తాజాగా కాంగ్రెస్‌లోని ఓ నాయకుడికి కోవర్టుగా మారి, కేటీఆర్, హరీశ్‌రావులకు వ్యతిరేకంగా జాతీయ మీడియాలో ప్రశ్నలు అడిగేలా ఈ పీఆర్‌వో చేసినట్లు ఇందులో పేర్కొన్నారు. కవితను ఎక్కువగా జాతీయ మీడియాలో కనిపించాలని ప్రేరేపించినట్లు వీడియోలో వివరించారు. తాజాగా కవిత రాసిన లేఖను సైతం ఈ పీఆర్‌వో రాజేషే తనకు సన్నిహితుడైన మీడియా పర్సన్ ద్వారా లీక్ చేసినట్లు పేర్కొన్నారు. జాతీయ మీడియా పేరిట కవిత వద్ద భారీగా డబ్బులు దండుకున్న ఇతను హైదరాబాద్ శివార్లలో విల్లా కొనుగోలు చేసినట్లు వైరల్ అవుతోంది. ఈ వీడియోను కేటీఆర్, హరీశ్‌రావులకు పంపినట్లు ఉద్యమకారులు చెబుతున్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



సుద్దులం రెవెన్యూ సదస్సులో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ హనుమంతు

- భూ భారతిని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాష్ట్రప్రభుత్వం
- రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

డిచ్‌పల్లి/ధర్పల్లి: భూసమస్యల శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. మంగళవారం డిచ్‌పల్లి మండలం సుద్దులం, ధర్పల్లి మండలం గోవింద్‌పల్లి గ్రామాలలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. రైతుల సమస్యలు తెలుసుకున్నారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇప్పటికే మెండోరా మండలంలో పైలెట్ ప్రాతిపదికన రెవెన్యూ సదస్సులు జరిపి, క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేశామన్నారు. జిల్లాలోని మిగతా 32 మండలాల్లో గల అన్ని రెవెన్యూ గ్రామాలలో ఈ నెల 20 వరకు సదస్సులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ల నేతృత్వంలో వేర్వేరుగా రెండు బృందాలను ఏర్పాటు చేసి రోజూ ప్రతి మండలంలో రెండు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరిపేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. భూ రికార్డులలో పేర్ల తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్-బి లో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సదస్సులలో స్వీకరిస్తారని తెలిపారు. భూభారతి కొత్త చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువులోపు సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆగస్టు 14 లోపు భూభారతి కింద వచ్చిన అన్ని అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. నిర్ణీత షెడ్యూల్ ను అనుసరిస్తూ ఆయా గ్రామాలలో అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వపరంగా నిర్ణీత ప్రొఫార్మాలో ప్రింట్ చేసిన దరఖాస్తులను అందజేస్తారని తెలిపారు. ఇందుకోసం హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేశామన్నారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ కోసం వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలని కలెక్టర్ సూచించారు.

ఈ సందర్భంగా రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్ ల వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. భూ సంబంధిత సమస్యలు ఉన్న వారు నిర్ణీత ప్రొఫార్మాలో సరైన విధంగా దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, డిచ్‌పల్లి, ధర్పల్లి తహసీల్దార్లు కే సతీష్‌రెడ్డి, శాంత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సంతోష్, రాజేశ్వర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

500 మందికిపైగా నోటీసులు

- 'వివరణ' ఇచ్చేందుకు డీపీవో కార్యాలయానికి తరలి వచ్చిన పంచాయతీ కార్యదర్శులు

సుభాష్‌నగర్: కలెక్టరేట్‌లోని జిల్లా పంచాయతీ కార్యాలయానికి 500 మందికిపైగా పంచాయతీ కార్యదర్శులు మంగళవారం తరలివచ్చారు. ఒకేసారి వందల సంఖ్యలో రావడంతో కార్యాలయ సిబ్బంది అయోమయానికి గురయ్యారు. ఇంతమంది రావడానికి గల కారణాలను ఆరా తీయగా.., నోటీసులకు వివరణ ఇచ్చేందుకు వచ్చినట్లు తెలిసి ఉద్యోగులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులకు డైలీ శానిటేషన్ రిపోర్ట్ (డీఎస్ఆర్) కొత్త యాప్‌ను నూతనంగా ప్రవేశపెట్టింది. ఇందులోభాగంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పంచాయతీ కార్యదర్శులు ఫేస్ రికగ్నిజేషన్ (ఆన్‌లైన్ అటెండెన్స్) నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ తరహా అటెండెన్స్‌ను నిరసిస్తూ పంచాయతీ కార్యదర్శులు గత నెల 24 నుంచి డీఎస్ఆర్‌ను చేపట్టడంలేదు. దీంతో పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు మే 31న పంచాయతీ కార్యదర్శులందరికీ డీపీవో శ్రీనివాస్‌రావు మెమోలు (నోటీసులు) జారీచేశారు. డీఎస్ఆర్‌ను ఎందుకు చేపట్టడం లేదో వివరణ ఇవ్వాలని ఆ మెమో సారాంశం. అందులోభాగంగా పంచాయతీ కార్యదర్శులందరూ ఒకేసారి డీపీవో కార్యాలయానికి తరలివచ్చారు. డీపీవో కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి వివరణలు స్వీకరించారు.



డీపీవో కార్యాలయంలో వివరణ ఇచ్చుకుంటున్న పంచాయతీ కార్యదర్శులు

విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

- అదనపు కలెక్టర్ అంకిత్

నిజామాబాద్ అర్బన్: సీజనల్ వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా అంకితభావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలో డెంగీ, చికున్ గున్యా, మలేరియా, టైఫాయిడ్ తదితర విషజ్వరాలు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్య పనులు పక్కాగా జరిగేలా నిరంతరం పర్యవేక్షణ చేయాలని, దోమల నివారణకు అన్ని నివాస ప్రాంతాలలో ఫాగింగ్ చేయించాలని, నిలువ నీరు ఉన్న చోట, మురుగు కాలువలలో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. ఎక్కడైనా డెంగీ కేసులు నమోదైతే చుట్టుపక్కల అన్ని నివాస గృహాల వద్ద నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దోమల నివారణ మందులను గ్రామపంచాయతీలలో అందుబాటులో ఉంచుకోవాలని, వారానికి కనీసం రెండు పర్యాయాలు తప్పనిసరిగా పిచికారీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న దృష్ట్యా అన్ని పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలు, రెసిడెన్షియల్ బడులలో దోమల నివారణ చర్యలు చేపట్టాలని, పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. వారంలో రెండు రోజులు డ్రై డే నిర్వహించేలా చూడాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నిర్ధారణ కోసం ప్రజలు ర్యాపిడ్ టెస్టులు చేయించుకునేందుకు వీలుగా టోల్ ఫ్రీ నంబర్ 9390653962 ను సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఎంహెచ్‌వో రాజశ్రీ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్, పాల్గొన్న వైద్యాధికారిణి రాజశ్రీ

ఈతకు వెళ్లి.. విగతజీవిగా మారి..

- నిజాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో మునిగి ముగ్గురి మృత్యువాత
- మూడు కుటుంబాల్లో తీరని విషాదం

ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డిరూరల్: సరదాగా క్రికెట్ ఆడిన యువకులు.. ఈత కొట్టేందుకు నిజాంసాగర్ బ్యాక్ వాటర్ ప్రాంతానికి వెళ్లి నీట మునిగి మృతిచెందారు. ఈ ఘటన మూడు కుటుంబాలలో విషాదాన్ని నింపింది. పోలీసులు, స్థానికులు తెలపిన వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డి మండలానికి చెందిన 11 మంది యువకులు సోమవారం సోమార్‌పేట్ గ్రామ శివారులో క్రికెట్ ఆడారు. అనంతరం స్నానం చేసేందుకు నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో దిగారు. వీరిలో ఎల్లారెడ్డికి చెందిన మధుకర్‌గౌడ్(17), సోమార్‌పేట్‌కు చెందిన హర్షవర్ధన్(17), తిమ్మారెడ్డికి చెందిన నవీన్(23) గల్లంతయ్యారు. మృతుల బంధువులు గాలించేందుకు ప్రయత్నించినా అప్పటికే చీకటి పడడంతో వెనుదిరిగారు. మంగళవారం ఉదయం ఫైర్ సిబ్బందితో పాటు మృతుల బంధువులు నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో వలలతో గాలించారు. మొదట మధుకర్‌గౌడ్ మృతదేహం లభ్యమయ్యింది. మధ్యాహ్న సమయంలో నవీన్, హర్షవర్ధన్‌ల మృతదేహాలు లభించాయి. చెట్టంత కొడుకులు కళ్లముందు విగత జీవులుగా కనిపించడంతో మృతుల కుటుంబ సభ్యుల రోదనలు స్థానికులను కంటతడి పెట్టించాయి.



నిజాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో మృతదేహాల కోసం గాలిస్తున్న ఫైర్ సిబ్బంది, మృతుల బంధువులు



రోదిస్తున్న మధుకర్‌గౌడ్ కుటుంబ సభ్యులు

గాలింపు చర్యలను పట్టించుకోని అధికారులు

నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో ముగ్గురు యువకులు గల్లంతైనా ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. ఫైర్ సిబ్బందితో పాటు మృతుల బంధువులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వలల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. అధికారుల తీరుపై స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బందిని స్థానికులు అభినందించారు.

ఒక్కగానొక్క కుమారుడు..

సోమార్‌పేట గ్రామానికి గూల రాజలింగం దంపతులకు హర్షవర్ధన్ (17) ఒక్కడే కొడుకు. ఇంటర్ చదువుతూ గ్రామంలో అందరితో కలుపుగోలుగా ఉండేవాడు. సోమవారం సరదాగా ఆడుకోవడానికి వెళ్లి తిరిగి రాని లోకాలకు వెళ్లాడు. నిజాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో మునిగి చనిపోవడంతో అతడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన కిషన్‌గౌడ్ పెద్ద కొడుకు మధుకర్‌గౌడ్ (17) ఇంటర్ చదువుతున్నాడు. తోటి వారితో ఆటపాటలతో సరదాగా ఉండేవాడు. స్నేహితులతో కలిసి ఆడుకోవడానికి వెళ్లిన మధుకర్.. నిజాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో మునిగి చనిపోవడంతో అతడి కుటుంబ సభ్యులు పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారు.

అనారోగ్యంతో ఒకరు.. నీట మునిగి మరొకరు..



రోదిస్తున్న నవీన్ తల్లిదండ్రులు

తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన ఐతె సామెల్ దంపతులకు ఇద్దరు కుమారులు. మతిస్థిమితం సరిగ్గాలేని పెద్ద కుమారుడు సాయిబాబు నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించాడు. చిన్న కొడుకు నవీన్ బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. అతడైనా వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటాడనుకుంటే.. సోమవారం నిజాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో మునిగి చనిపోయాడు. ఇలా ఇద్దరు కుమారులు కళ్లముందే మరణించడంతో సామెల్ దంపతులకు తీరని గర్భశోకం మిగిలింది.



హరిత మార్గం.. ఆహ్లాద భరితం

పచ్చని చెట్లు ప్రయాణికులకు ఆహ్లాదం పంచుతున్నాయి. రోడ్డంతా పందిరి వేసినట్లుగా పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. నిజామాబాద్ జిల్లా చందూరు మండలం ఘన్‌పూర్ గ్రామానికి వెళ్లే రోడ్డులో చెట్లు ఏపుగా పెరిగాయి. ఎర్రటి పూలతో ప్రయాణికులు, వాహనదారులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్–నిజామాబాద్

టేకు కలప పట్టివేత

సిరికొండ: సిరికొండ మండలంలోని పాకాల అటవీ ప్రాంతంలో అక్రమంగా నరికి నిల్వ చేసుకున్న టేకు కలపను పట్టుకున్నట్లు రేంజర్ రవీందర్ మంగళవారం తెలిపారు. 45 టేకు దుంగలు, 86 సైజులుగా మార్చిన కర్రలను స్వాధీనం చేసుకున్నామన్నారు. టేకు చెట్లను అక్రమంగా నరికిన పాకాల గ్రామానికి చెందిన బాదావత్ బాల్య, బాదావత్ మహిపాల్, బాదావత్ నబ్యా, బాదావత్ పీర్యా, మాలావత్ జవహర్‌లాల్‌పై కేసు నమోదు చేశారు.



క్లుప్తంగా

డిగ్రీ పరీక్షల్లో 339 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో మంగళవారం 339 మంది గైర్హాజరైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 32 పరీక్ష కేంద్రాల్లో 3,331 మంది విద్యార్థులకు గానూ 2,992 మంది హాజరుకాగా 339 మంది పరీక్ష రాయలేదని పేర్కొన్నారు.

గ్లోబల్ యూత్ సమ్మిట్‌కు గంగోత్రి



తెయూ(డిచ్‌పల్లి): కర్ణాటక రాష్ట్రం మంగుళూరు యెనేపోయా యూనివర్సిటీలో ఈ నెల 5, 6వ తేదీల్లో జరిగే గ్లోబల్ సమ్మిట్‌కు తెలంగాణ వర్సిటీ కామర్స్ విభాగం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ (విద్యార్థిని) రామగిరి గంగోత్రి ఎంపికైనట్లు కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కే రవీందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. కల్చరల్ విభాగంలో గంగోత్రి యూనివర్సిటీ స్థాయిలో మంచి ప్రావీణ్యాన్ని ప్రదర్శించిందన్నారు. ఈ యూత్ సమ్మిట్‌లో ప్రధానంగా యువత సాధికారతపై ప్యానల్ చర్చ, లక్ష్యాలు, నెట్‌వర్కింగ్ అవకాశాలు, వాలంటీర్ల అభిప్రాయాలు, మంచి భవిష్యత్‌కు యూత్ సహాయం అనే అంశాలపై చర్చలుంటాయని తెలిపారు. గంగోత్రిని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 4 ప్రోగ్రాం ఆఫీసర్ ప్రవంతి పాల్గొన్నారు.

7న షటిల్ బ్యాడ్మింటన్ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: ఈ నెల 7న జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్‌-17, 19 విభాగం బాలబాలికలకు, సీనియర్ మహిళలు, పురుషుల కేటగిరిలో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్నాటివాసు, కేవీ కిరణ్‌కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. మోపాల్ మండలంలోని ఫిట్‌నెస్ క్లబ్‌లో జిల్లాస్థాయి ఎంపికలు ఉంటాయన్నారు. ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 9490815229, 9440007576 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రాణాలకు ఖరీదు కడుతున్నారు

వేల్పూర్ మండలం పడగల్ గ్రామానికి చెందిన రాధిక వెన్ను నొప్పితో నగరంలోని ప్రతిభా ఆస్పత్రిలో చేరింది. మాయమాటలు చెప్పి అర్హతకు మించి, అనుభవం లేని వైద్యులు ఆపరేషన్ చేయడంతో ఆమె మృతి చెందింది. ఆస్పత్రిలో రోజంతా హైడ్రామా చేసి రూ.3 లక్షల 20 వేలు చేతిలో పెట్టి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

మాక్లూర్ మండలం అడవిమామిడిపల్లికి చెందిన గర్భిణి సుమలత ఇటీవల నగరంలోని శ్రీరక్ష ఆస్పత్రికి చెకప్ కోసం వచ్చింది. గైనిక్ వైద్యురాలు పరిశీలించి గర్భంలో ఉమ్మనీరు తక్కువ ఉంది.. కచ్చితంగా అడ్మిట్ కావాలని చెప్పడంతో అడ్మిట్ అయ్యారు. రక్తం కూడా ఎక్కించారు. వైద్యురాలి నిర్లక్ష్యంతో సుమలత మరణించింది. రాత్రికిరాత్రే బేరసారాలు జరిపి నిండు గర్భిణి ప్రాణానికి రూ.3 లక్షల 50 వేలు వెలకట్టారు.

- ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇష్టారీతిన వైద్య సేవలు
- వైద్యం కోసం వస్తే గాలిలోకి ప్రాణాలు
- చచ్చినా, బతికినా ఫీజులు వసూలు
- కనీస అర్హత లేని వైద్యులతో ఆపరేషన్లు
- రోగి చస్తే శవంతో బేరసారాలు



నిజామాబాద్ నాగారం: ఆరోగ్యం బాగు కోసం ఆస్పత్రికి వస్తే.. రోగం నయం కావడం అటుంచి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో కనీస అర్హత లేని వైద్యులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నిర్లక్ష్యంతో ప్రాణాలు తీస్తున్నారు. పోయిన ప్రాణాలకు ఖరీదు కడుతూ కుటుంబ సభ్యులకు శవాలను అప్పగిస్తున్నారు. చాలా చావులను బయటికి రాకుండా కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు డబ్బులు ముట్టజెప్పి చేతులు దులుపుకుంటున్నాయన్న ఆరోపణలున్నాయి.

కేసులు కాకుండా..

ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చే రోగులు వైద్యం వికటించి మరణిస్తే కేసులు కాకుండా యాజమాన్యాలు బాధిత కుటుంబ సభ్యులతో బేరసారాలు చేస్తున్నాయి. రోగం నయమైతే ఒక రేటు, చస్తే మరో రేటు అంటూ ముందుగానే కుటుంబసభ్యులతో మాట్లాడుకుంటున్నారు. ఒకవేళ చనిపోతే నయానో భయానో, బతిమిలాడుకుంటూ డబ్బులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. కేసు నమోదైతే ఆస్పత్రులకు చెడ్డపేరు వస్తుందని, బడా నాయకుల పేరు చెప్పి రోగుల బంధువులను భయభ్రాంతులకు గురిచేసి ఎంతో కొంత ముట్టజెప్పి మృతదేహాన్ని చేతిలో పెట్టి ఇంటికి పంపిస్తున్నారు.

కీలకంగా ఆర్‌ఎంపీ, పీఎంపీలు..

జిల్లాలో సుమారు 400 మంది పైగా ప్రైవేటు ఆస్పత్రులున్నాయి. అనుభవం లేని వైద్యులు సైతం పెద్దపెద్ద కార్పొరేట్ ఆస్పత్రుల్లో సీనియర్ వైద్యులుగా కొనసాగుతున్నారు. వీరివల్లే చాలా మంది రోగులు చనిపోతున్నారని రోగుల బంధువులు ఆవేదన చెందుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడడానికి కారణం ఆర్‌ఎంపీ, పీఎంపీలే కారణం. పల్లెల్లో ఉన్న ప్రజలకు మాయమాటలు చెప్పి ఫలానా పెద్ద ఆస్పత్రికి వెళ్తే రోగం నయమవుతుందంటూ రిఫర్ చేస్తున్నారు. దీంతో ఒక్కో రోగికి సదరు ఆస్పత్రి నుంచి కమీషన్ తీసుకుంటూ దందా కొనసాగిస్తున్నారు.

ఫిర్యాదులు వస్తేనే చర్యలా?

ప్రైవేటు ఆస్పత్రుల ఘనకార్యాలపై కేవలం ఫిర్యాదు వస్తేనే చర్యలు తీసుకుంటామని వైద్యారోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. మరోవైపు పోలీసులు సైతం అన్నీ తెలిసినా తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో కనీస నిబంధనలు పాటించని ఆస్పత్రులు చాలా ఉన్నాయి. ఈ ఆస్పత్రుల్లో రోగులకు ఎలాంటి వైద్యం అందిస్తున్నారు? ఎవరు విధులు నిర్వర్తిస్తున్నారో క్షేత్రస్థాయిలో తెలుసుకోవాల్సిన బాధ్యత వైద్యశాఖకు లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రాణాలు పోతున్నా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విచారణ చేశాం

ప్రతిభ ఆస్పత్రిలో మహిళ మృతి చెందిన విషయం తెలిసింది. డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో విచారణ చేయించాం. పూర్తి విషయాలు తెలుసుకున్న తర్వాత, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. ఎవరికైనా నాణ్యమైన వైద్యం అందకుంటే ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– రాజశ్రీ, డీఎంహెచ్‌వో, నిజామాబాద్

పాతికేళ్లకు కలిశారు..



అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

- అర్గుల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ మైత్రి గార్డెన్స్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. అర్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–21లో విద్యనభ్యసించిన పదో తరగతి విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత కలిశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకొని సంబరపడ్డారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

ప్రజావాణి ఫిర్యాదుపై డీపీవో విచారణ



డిచ్‌పల్లి: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుపై మంగళవారం ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్ డిచ్‌పల్లి మండలం రాంపూర్ గ్రామంలో విచారణ నిర్వహించారు. చికెన్ సెంటర్ ఏర్పాటు విషయంలో వీడీసీ సభ్యులు అడ్డుపడుతున్నారని గ్రామానికి చెందిన యువకుడు ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ ఆదేశాలతో రాంపూర్ జీపీలో మంగళవారం ఇరు వర్గాలతో సమావేశమై మాట్లాడారు. చికెన్ సెంటర్ ఏర్పాటును అడ్డుకోవద్దని వీడీసీకి సూచించారు. తాము ఎలాంటి అభ్యంతరం చెప్పబోమని వీడీసీ సభ్యులు అంగీకరించినట్లు డీపీవో తెలిపారు.

ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన

మీకు తెలుసా?



భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసీ), ఇతర బీమా కంపెనీలు ఏడాదికి రూ. 436 ప్రీమియంతో బీమాను అందిస్తున్నాయి.కుటుంబంలో ప్రతి ఒక్కరూ చేరవచ్చు. మరణం ఎలా సంభవించిన రూ.2 లక్షల బీమా సొమ్మును నామినీకి చెల్లిస్తారు. ఈపథకంలో ఒకసారి చేరితే 55 ఏళ్ల వరకు కొనసాగుతుంది. ఎలాంటి మెచ్యూరిటీ ఉండదు.

- ఏదేని బ్యాంకులో సేవింగ్ ఖాతా ఉన్న 18 నుంచి 50 ఏళ్ల లోపు ఆధార్ కార్డు జిరాక్స్ అందజేసి పీఎంజేజేబీవైలో చేరవచ్చు. 50 ఏళ్లలోపు వారు చేరితే 55 ఏళ్ల వరకు పథకం కొనసాగుతుంది.
- ఏడాది కాలంలో ఏ నెలలో అయినా స్కీంలో చేరవచ్చు. ఖాతాలో సరైన డబ్బు నిల్వ ఉంటే ప్రతి సంవత్సరం మే నెలలో ప్రీమియం ఆటో డెబిట్ అవుతుంది.
- రోజుకు ఒకరూపాయి 20 పైసలతో రెండు లక్షల జీవిత బీమా.
- స్కీంలో చేరడానికి ఎలాంటి వైద్య పరీక్షలు అవసరం లేదు.

– కామారెడ్డి అర్బన్

నగర పోలీస్ స్టేషన్ల నంబర్లు

ఒకటో టౌన్	87126 59837
రెండో టౌన్	87126 59838
మూడో టౌన్	87126 59839
నాలుగవ టౌన్	87126 59840
ఐదో టౌన్	87126 59844
ఆరో టౌన్	87126 59848
మహిళా పోలీస్‌స్టేషన్	87126 59841

– ఖలీల్‌వాడి

ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక

- ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

వర్ని: ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న ప్రతి లబ్ధిదారుడికి ఉచితంగా ఇసుక అందజేస్తామని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. వర్ని మండల కేంద్రంలో వర్ని, చందూర్, మోస్రా, రుద్రూర్ మండలాలకు చెందిన 805 మంది లబ్ధిదారులకు మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుకను మంజీర నుంచి ఉచితంగా తెచ్చుకోవాలని, రెవెన్యూ అధికారులు అనుమతి ఇస్తారని తెలిపారు. ఇంటి నిర్మాణం, బిల్లుల కోసం ఎవరికీ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని వెల్లడించారు. గత ప్రభుత్వంలో గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు మంజూరై నిర్మించుకున్న వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని వెల్లడించారు. బాన్సువాడ నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరయ్యాయని, ప్రతి లబ్ధిదారుడు వెంటనే ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించాలని సూచించారు. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేశ్ బాబా, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు లక్ష్మణ్, మాజీ ఉపాధ్యక్షులు గోపాల్, మాజీ జెడ్పీటీసీలు హరిదాసు, నారోజీ గంగారాం, అంబర్‌సింగ్, నాయకులు హనుమంత రెడ్డి, పిట్ల రాము, వీర్రాజు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థినికి స్వర్ణ పతకాలు



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న బొబ్బిలి శరణ్య

మాక్లూర్: మండలంలోని దాస్‌నగర్ వద్ద గల విజయ్ రూరల్ ఇంజినీరింగ్ కళాశాల ఫార్మసీ విద్యార్థిని బొబ్బిలి శరణ్య ప్రతిష్టాత్మకమైన మూడు స్వర్ణ పతకాలను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా హైదరాబాద్‌లో అందుకున్నారు. జేఎన్‌టీయూ ప్రకటించిన బెస్ట్ హౌ టు గోయింగ్ విద్యార్థినిగా, ఫార్మసీలో ఫస్ట్ ర్యాంకర్, షా దాన్ ఎండోమెంట్, బెస్ట్ స్టూడెంట్‌గా డాక్టర్ ఆంధ్ర నాయుడు ఎండోమెంట్ స్వర్ణ పతకాలను ఏకకాలంలో అందుకున్నారు. వీఆర్‌ఈసీ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శరణ్యను చైర్మన్ నరేందర్ రెడ్డి, సీఈవో అమృతలత, ప్రిన్సిపల్ సురేశ్ అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో 15 మందికి జైలు

- కొలిప్యాక్ వీడీసీ సభ్యులకు మూడు నుంచి ఐదేళ్ల శిక్ష

నిజామాబాద్ లీగల్ : దళిత మహిళ కుటుంబాన్ని వేధించిన కేసులో నిజామాబాద్ రెండో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొలిప్యాక్ గ్రామానికి చెందిన వీడీసీ సభ్యులు 15 మందికి మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తూ జడ్జి టీ శ్రీనివాస్ మంగళవారం తీర్పునిచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొలిప్యాక్ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల రుక్మవ్వ తన భర్త హన్మాండ్లు, కుమారుడు, కూలీలతో కలిసి 22 ఏప్రిల్, 2020న తన పొలంలోకి నుంచి ట్రాక్టర్‌లో గడ్డి వేసుకొని తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో గ్రామస్తులు మేకల బబ్బు, మేకల భవానీ ఉద్దేశపూర్వకంగా ట్రాక్టర్‌ను ఆపి అగ్గి పెడుతామని బెదిరించారు. ఈ విషయమై గ్రామ జన సంఘం నాయకులైన తిరుపతి తదితరులు పంచాయితీ నిర్వహించి రుక్మవ్వకు జరిమానా విధించారు. ఆమెతోపాటు కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేశారు. దీనిపై రుక్మవ్వ జక్రాన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిజామాబాద్ ఏసీపీ శ్రీనివాస్ కుమార్ నేర విచారణ నిర్వహించి అభియోగ పత్రాన్ని కోర్టులో సమర్పించారు. నేర న్యాయ విచారణలో భాగంగా మొత్తం 15 మంది సాక్షుల సాక్ష్యాలు నమోదు చేసి న కోర్టు, 15 ధ్రువీకరణ పత్రాలను అధ్యయనం చేసి ముద్దాయిలపై నేరారోపణలు రుజువైనట్లు నిర్ధారిస్తూ శిక్షలను ఖరారు చేసింది. కేసులో మేకల బబ్బు అలియాస్ మేకల మహేంద్ర, మేకల కవిత అలియాస్ భవానీ, గొల్ల బొడ్డు తిరుపతి, ముప్పాల పోషన్న, రావుట్ల బక్కన్న, పాపి గంగాధర్ అలియాస్ గూండ్ల పాపి గంగాధర్, బొడ్డు నవీన్ అలియాస్ బొల్లి నవీన్, కలకాడి ముత్తెన్న అలియాస్ చాకలి ముత్తెన్న, మాల చిన్న రాజన్న అలియాస్ జంగం చిన్న రాజన్న, బొల్లి రంజిత్ అలియాస్ కోమటి రంజిత్, వడ్ల శ్రీకాంత్, దాసరి సురేందర్, ఆరేపల్లి ఇస్తారి అలియాస్ కుమ్మరి ఇస్తారి, వంకాయల గంగాధర్, తలారి గంగాధర్‌కు ఇండియన్ పినల్ కోడ్, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల చట్టం, పౌర హక్కుల పరిరక్షణ చట్టాల ప్రకారం జైలుశిక్షలు విధిస్తూ జడ్జి టీ తీర్పు వెలువరించారు. పోలీసుల తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బంటు వసంత్ ప్రాసిక్యూటర్‌గా వ్యవహరించారు.

క్రైం కార్నర్


తిమ్మారెడ్డికి చేరిన యువకుడి మృతదేహం



ఎల్లారెడ్డి: మండలంలోని తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన గూల గోవర్దన్ (28) మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరుకుంది. గత నెల 29న గోవర్దన్ అమెరికాలోని ఒకాయోలో అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. గోవర్దన్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబానికి ఆసరాగా నిలవాల్సిన కొడుకు మృతితో తండ్రి విఠల్ రోదనలు అందరినీ కలచివేశాయి. గోవర్దన్ అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ హాజరయ్యారు.

12 కిలోల గంజాయి పట్టివేత

- రైలులో తరలిస్తుండగా గుర్తించిన ఎక్సైజ్, రైల్వే పోలీసులు



కామారెడ్డి క్రైం: రైలులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎక్సైజ్ సీఐ సంపత్ క్రిష్ణ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని నాందేడ్‌కు వెళ్తున్న నాగావలి ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో ఎక్సైజ్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు కామారెడ్డిలో రైలు ఆగగానే తనిఖీలు చేపట్టారు. ఓ అనుమానాస్పద బ్యాగులో 12 కిలోల ఎండు గంజాయి ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఎవరనేది తెలియలేదు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు. సమావేశంలో ఎక్సైజ్ ఎస్సై విక్రమ్, ఆర్‌పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు, ఏఎస్సై రవీంద్ర బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ కుటీరం దగ్ధం



మోపాల్: మండలంలోని సిర్పూర్ శివారులో ఉన్న బాలయోగి అవధూత నిర్మలానంద స్వామి ఆశ్రమంలోని కుటీరం సోమవారం రాత్రి దగ్ధమైంది. పోలీసులు, నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆశ్రమంలో సోమవారం సాయంత్రం వరకు భక్తులు భజనలు, కీర్తనలు చేశారు. అనంతరం కుటీరానికి తాళం వేసి వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం చూసే సరికి కుటీరం దగ్ధమైంది. ఎస్సై యాదగిరి గౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. భక్తుడు మాణిక్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, ఆశ్రమం నిర్మించిన స్థలంపై గత కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రాత్రికిరాత్రే కుటీరం దగ్ధం కావడంపై భక్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

డీఎస్‌వో కార్యాలయానికి పోలీస్ బందోబస్తు



సుభాష్‌నగర్: నగరంలోని కలెక్టరేట్‌లోగల జిల్లా పౌరసరఫరాలశాఖ కార్యాలయానికి మంగళవారం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇటీవల కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు, కార్డుల్లో సభ్యుల పేర్ల చేర్పులు, మార్పులపై దరఖాస్తుదారులు వందల సంఖ్యలో తరలివచ్చారు. దీంతో కార్యాలయం వద్ద గందరగోళం నెలకొని ఉద్యోగులు ఒత్తిడికి గురవుతున్నారు. పరిస్థితి అదుపు తప్పితే అనుకోని ఘటనలు ఏమైనా జరగవచ్చని ఉద్దేశంతో పౌరసరఫరాలశాఖ అధికారి వినతి మేరకు కలెక్టరేట్ పోలీసులు కార్యాలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘరానా దొంగల ముఠా అరెస్ట్

- 39 దొంగతనాలకు పాల్పడిన 8 మంది నిందితులు
- 15 తులాల బంగారం, 4 వాహనాల స్వాధీనం
- సీసీ ఫుటేజీ ఆధారాలతో కేసు ఛేదన
- సీపీ పోతరాజు సాయిచైతన్య వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న సీపీ సాయి చైతన్య

ఖలీల్‌వాడి: జిల్లాలో చోరీలకు పాల్పడిన ఘరానా దొంగల ముఠా సభ్యులను సీసీ ఫుటేజీల ఆధారంగా పట్టుకున్నట్లు సీపీ పోతరాజు సాయిచైతన్య వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ మాట్లాడారు. నగరంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు ఇళ్లలో చోరీలకు పాల్పడిన కేసులు నమోదయ్యాయి. దీంతో పోలీసులు ఘటన స్థలంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి, ఆధారాలను సేకరించి దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అమేర్‌పై అనుమానం రావడంతో ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం అదుపులోకి తీసుకొని విచారణ చేశారు. అమేర్ చిన్నతనంలో పిక్‌ప్యాకెట్లకు పాల్పడేవాడని, దొంగతనాలు చేసేటప్పుడు హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ ఆసిఫ్‌తో పరిచయం ఏర్పడింది. అబ్దుల్ ఆసిఫ్ తనకు పరిచయం ఉన్న వసీం, సోహైల్, జావీద్ ఖాన్, రియాజ్, అలీ, ఆసిఫ్ ఖాన్‌ను మహమ్మద్ అమేర్‌కు పరిచయం చేశాడు. వీరంతా గతంలో నేరాలకు పాల్పడినవారే. అందరూ కలిసి ఒక ముఠాగా ఏర్పడి పక్కా ప్రణాళికతో దొంగతనాలు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా ముఠా సభ్యులు నగరంలోని ఆటోనగర్, ధర్మపురిహిల్స్, పెయింటర్ కాలనీ, డ్రైవర్ కాలనీ, అక్బర్‌నగర్ కాలనీ, శాంతినగర్‌లో సుమారు 24 ఇండ్ల తాళాలు పగలగొట్టి దొంగతనాలు చేశారు. దొంగిలించిన బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను షేక్ వసీంకు ఇచ్చేవారు. వసీం వాటిని నిజామాబాద్‌రూరల్ మండలంలోని మోహన్‌కు అమ్మేవాడు. మోహన్ వస్తువులను తక్కువ ధరకు కొనుగోలు చేసేవాడు. వచ్చిన నగదును అందరూ కలిసి పంచుకునేవారు. వీరు హైదరాబాద్ శివార్‌లోని షాపూర్, జీడిమెట్ల పరిసర ప్రాంతాలలో 15 ఆటోలను కూడా దొంగతనం చేశారు. ముఠాసభ్యుల్లో షేక్ వసీంపై 8 కేసులు ఉండగా మీర్‌పేటలో పీడీయాక్ట్ నమోదు చేశారు. షేక్ సోహైల్ అలియాస్ చార్‌పాట్ సోహైల్‌పై గతంలో 7 కేసులు, మహమ్మద్ అమేర్‌పై 21 కేసులు, మహమ్మద్ అబ్దుల్ ఆసిఫ్‌పై 10 కేసులు, జావీద్ ఖాన్ 5 కేసుల్లో నిందితుడిగా ఉన్నారు. ముఠా సభ్యులపై నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, హైదరాబాద్ నగరాలలో కేసులు నమోదైనట్లు సీపీ వెల్లడించారు. బంగారం కొనుగోలు చేసిన మోహన్‌పై కేసు నమోదు చేశామన్నారు. నిందితుల నుంచి 15 తులాల బంగారం, నాలుగు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసులో బబ్లూ, అలీ అనే నిందితులు పరారీలో ఉన్నారని, మిగతా వారిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. కేసు ఛేదనకు కృషి చేసిన సీఐ సురేశ్, ఎస్సై వెంకట్రావు, కానిస్టేబుళ్లను అభినందించి, రివార్డు అందజేశారు.

మహిళ హత్య కేసు ఛేదన



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్ రెడ్డి

బాల్కొండ: నందిపేట్ మండలం అయిలాపూర్ శివారులో గత నెల 26న జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. బాల్కొండ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. నందిపేట్ మండలం శాపూర్‌కు చెందిన సాద సుమలత(42) గత నెల 26న కూరగాయల కోసం మండల కేంద్రంలో నిర్వహించే సంతకు వచ్చింది. మార్కెట్‌లో ఆలూర్ మండల కేంద్రానికి చెందిన వేల్పుల పెద్ద గంగాధర్‌తో పరిచయం ఏర్పడింది. సుమలతను అయిలాపూర్ శివారులోని వంతెన వద్దకు తీసుకెళ్లిన గంగాధర్.. అత్యాచారానికి యత్నించాడు. సుమలత విభేదించడంతో చీర కొంగుతో గొంతు నులిమి హత్య చేశాడు. 27న సుమలత శవమై కనిపించడంతో కొడుకు సాద సంజీవ్ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానంతో కేసును ఛేదించారు. మంగళవారం మధ్యాహ్నం నిందితుడు గంగాధర్ ఆర్మూర్ నుంచి నిర్మల్ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో బాల్కొండ మండలం చిట్టాపూర్ చౌరస్తా వద్ద పోలీసులు అదుపులోకి తీసుకొని కోర్టులో ప్రవేశపెట్టినట్లు సీఐ తెలిపారు. కేసును ఛేదించిన నందిపేట్ ఎస్సై చిరంజీవి, సిబ్బందిని సీఐ అభినందించారు. కాగా, గంగాధర్‌పై గతంలో మాక్లూర్ పోలీస్‌స్టేషన్‌లో హత్య కేసుతోపాటు దొంగతనం కేసు కూడా నమోదైంది.

టిప్పర్ ఢీకొని ఒకరి మృతి



లక్ష్మణ్ (ఫైల్)

మాక్లూర్ : ఎదురుగా వస్తున్న టీవీఎస్ ఎక్సెల్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని మాదాపూర్, బొంకన్‌పల్లి గ్రామాల మధ్యలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. రోడ్డు ప్రమాదానికి టిప్పర్ అతివేగమే కారణమని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జన్నెపల్లి నుంచి మాదాపూర్ వైపు వెళ్తున్న టిప్పర్.. ఎదురుగా టీవీఎస్ ఎక్సెల్‌పై వస్తున్న ముల్లంగి (బి) గ్రామానికి చెందిన భూలోళ్ల నడిపి గంగాధర్ అలియాస్ లక్ష్మణ్ (65)ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన లక్ష్మణ్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి కొడుకు రాజు ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో జారిపడి యువకుడు..

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలోని చెరువులో జెట్టి గోపాల్ (21) మృతదేహం మంగళవారం లభ్యమైంది. కూలి పనులు చేసే గోపాల్ గత నెల 31న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు వెతుకుతుండగా స్థానిక చెరువులో మృతదేహం లభించింది. స్నానం చేసేందుకు వెళ్లిన గోపాల్ ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి ఉంటాడని మృతుడి సోదరి సురేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

మహిళ మెడలోంచి గొలుసు చోరీ

ఖలీల్‌వాడి: వాకిలి ఊడుస్తున్న మహిళ మెడలోంచి గొలుసు చోరీ అయిన ఘటన నగరంలోని ఐదో టౌన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై గంగాధర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగారంలోని 300 క్వార్టర్స్‌కు చెందిన చందా సావిత్రి మంగళవారం ఉదయం 6: 15 గంటలకు ఇంటి ముందు వాకిలి ఊడుస్తుండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు పల్సర్ బైక్‌పై నుంచి వచ్చి ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల మంగళసూత్రం, చైన్‌ను లాక్కొని పరారయ్యారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా నిందితులు 300 క్వార్టర్స్ నుంచి బాబన్ షా పహాడీ ఏరియాకు వెళుతున్నట్లు కనబడిందన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

జంతుమాంసం తరలిస్తున్న ఆటో పట్టివేత

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోచారంలో గుర్తుతెలియని జంతుమాంసాన్ని తరలిస్తున్న ఆటోను మంగళవారం ఉదయం గ్రామస్తులు పట్టుకొని చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులకు అప్పగించారు. బక్రీద్ నేపథ్యంలో పోచారం వద్ద 20 రోజుల క్రితం పోలీసులు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. కాగా, మండలంలోని గోపాల్‌పేటకు చెందిన ఓ వ్యక్తి మంగళవారం గుర్తుతెలియని జంతుమాంసాన్ని ముక్కలుగా చేసి సంచులలో నింపుకొని కిరాయి ఆటోలో చెక్‌పోస్టు ఉన్న దారిలో కాకుండా మరో దారిగుండా వెళ్తుండగా గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు.